క్లుప్తంగా

9న ప్రజాహిత పాదయాత్ర

ఊర్కొండ: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుద్ రెడ్డి ఈ నెల 9న ప్రజాహిత పాదయాత్ర నిర్వహిస్తున్నారని, ఈ యాత్ర జగబోయిన్‌పల్లి నుంచి ప్రారంభమవుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ముచ్చర్లపల్లిలోని ఆయన స్వగృహంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయడానికి ఈ యాత్రను చేపడుతున్నట్లు చెప్పారు. కంఠం విజయుడు, సత్యనారాయణ రెడ్డి, గోపి నాయక్ తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీ కార్యవర్గం ఎన్నిక



కల్వకుర్తి రూరల్: విశ్వహిందూ పరిషత్ నగర కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా దామోదర్, పార్వతమ్మ, కార్యదర్శిగా శివ, కోశాధికారిగా కిషన్, పట్టణ ప్రముఖ్‌గా వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, రాజుసాగర్, సునంద ఆధ్వర్యంలో ఎన్నికలు కొనసాగాయి. ఈ సందర్భంగా మహిళా కమిటీని ఎన్నుకున్నారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో రెండు రోజుల కిందట నూతనంగా వచ్చిన ఎస్‌ఐ సురేష్‌ను మల్లేశ్వరానికి చెందిన పలువురు నాయకులు సన్మానించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడారు. ప్రతిఒక్కరూ సహకరించాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా.. పోలీస్ స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. గ్రామాల్లో కొత్తగా ఎవరు కనిపించినా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. నర్సింహ, స్వాములు, కుర్మయ్య పాల్గొన్నారు.

మాసుం బాబ ఉర్సు పోస్టర్ విడుదల



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలులో మాసుం బాబ ఉర్సు సందర్భంగా ఆదివారం పీఠాధిపతి అల్హాద్ సయ్యద్ వలీ మొహినుద్దీన్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. 9న గంధోత్సవం, 10న దీపోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి గంధాలు పెద్ద ఎత్తున వస్తాయన్నారు.

ఎన్నికల్లో పోటీ చేస్తాం..



కల్వకుర్తి టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగులమంతా కలిసి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని ఓయూ జేఏసీ దక్షిణ తెలంగాణ చైర్మన్ కల్వకుర్తి ఆంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఏదైతే నినాదంతో తెలంగాణను సాధించుకున్నామో, అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో పాలన సాగుతుందని అన్నారు. 25న కల్వకుర్తి పట్టణంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పాలమూరు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

వరాహం ఆకారంలో మేకపిల్ల జననం

అచ్చంపేట రూరల్: మండలంలోని చందాపూర్‌లో వరాహం ఆకారంలో మేక పిల్ల జన్మించింది. గ్రామంలోని రాజుకు మేకల మంద ఉంది. ఆదివారం ఉదయం ఓ మేక రెండు పిల్లలను ఈనింది. అందులో ఒక మేక పిల్ల వరాహం ఆకారంలో ఉంది. మరో మేక పిల్ల బ్రతికి ఉండగా.. వరాహం ఆకారంలో ఉన్న మేక పిల్ల మృతిచెందింది. పుట్టిన మేక పిల్లను చూడటానికి గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వచ్చారు. జన్యులోపంతో ఇలాంటి వింత ఆకారంలో జన్మిస్తుంటాయని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలియజేశారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు కూచుకుళ్ల నివాళి

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని పుల్లగిరి గ్రామ పంచాయతీకి చెందిన బోరుసుగడ్డ తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త కేతావత్ అజయ్ డెంగీతో మృతిచెందడంతో అతని కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానన్నారు. నాగర్‌కర్నూల్ కౌన్సిలర్ శ్రీను, కృష్ణారెడ్డి, మాధవులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

జయశంకర్‌కు ఘన నివాళి



అచ్చంపేటలో నివాళి అర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో, తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు. రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, విష్ణుమూర్తి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: తెలంగాణ ఉద్యమకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు శేఖర్ గౌడ్, భీమేష్, తిరుమల్, సిద్ధార్థ, శివ, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగిద్దాం

కల్వకుర్తి రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగిద్దామని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కోరారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బీసీ సబ్‌ప్లాన్ విశ్వబ్రాహ్మణ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, జాగృతి ఆధ్వర్యంలో జయశంకర్ జయంతి నిర్వహించారు. బీసీ సబ్‌ప్లాన్ సాధన సమితి అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి గోపాల్, గంగాధర్, ఆనంద్, విశ్వబ్రాహ్మణ కమిటీ సభ్యులు రమేశ్‌బాబు పాల్గొన్నారు.

కొల్లాపూర్: మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ విజయలక్ష్మితో పాటు ఉద్యోగులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్‌తో పాటు అధ్యాపకులు, ఎమ్మెల్యే నివాసం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఊర్కొండ: మండల కేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో జయశంకర్‌కు నివాళి అర్పించారు. ద్యాప వీరారెడ్డి, జంగయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహించారు. ఉమ్మడి జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు కాళ్ల నిరంజన్, రవీందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వీరాచారి, కృష్ణయ్య, భాస్కరాచారి, జంగాచారీ, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో బీజేపీ నాయకులు



నాగర్‌కర్నూల్‌లో..



కల్వకుర్తిలో...



కొల్లాపూర్ ఎమ్మెల్యే నివాసం వద్ద



ఊర్కొండలో..

తీజ్ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కసిరెడ్డి

వెల్దండ: మండల పరిధిలోని ఎంజీతండాలో ఆదివారం గిరిజనులు తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనుల సంప్రదాయ ఉత్సవాలను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తామన్నారు. మొలకల బుట్టలతో ఊరేగింపు నిర్వహించి కుల దేవతలకు నైవేద్యాలు సమర్పిస్తారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్ యాదవ్, జంగయ్య యాదవ్, టాక్యానాయక్ తదితరులు ఉన్నారు.

భగవద్గీత గ్రంథాల జ్ఞాన ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

ఉప్పునుంతల: మండలంలోని కొరటికల్‌లో ఆదివారం ప్రబోధ సేవా సమితి అచ్చంపేట శాఖ ఆధ్వర్యంలో శ్రీమద్ భగవద్గీత గ్రంథాలపై జ్ఞాన ప్రచారం నిర్వహించారు. పురుషోత్తమ ప్రాప్తియోగం 16, 17 శ్లోకముల ఆధారంగా త్రైత సిద్ధాంతం ప్రతిపాదించబడి 100కు పైగా గ్రంథములు రచించబడ్డాయన్నారు. ప్రబోధ సేవా సమితి అచ్చంపేట, నాగర్‌కర్నూల్ శాఖల సభ్యులు సాయిశంకర్, రమాదేవి, జంగమ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి సైకిల్‌యాత్ర



కల్వకుర్తికి చేరుకున్న సైకిల్ యాత్ర



తాడూరులో నిరసన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు

కల్వకుర్తి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి సమరభేరి సైకిల్ యాత్ర ఆదివారం కల్వకుర్తికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని పలు హాస్టళ్లను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందర్శించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు తారాసింగ్ మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని, ప్రభుత్వం పెంచిన మెస్ ఛార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.2,500 మెస్ ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగ సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్తీక్, రామకృష్ణ, రవి, సుల్తాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతులు మెరుగుపరచాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ అన్నారు. సమరభేరీ సైకిల్ యాత్ర ఆదివారం 5వ రోజు మండల కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో దాదాపు 120 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కార్తీక్, రామకృష్ణ, శివకుమార్, లక్ష్మణ్, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



కల్వకుర్తి స్నేహితుల దినోత్సవం



అచ్చంపేటలో...

కల్వకుర్తి రూరల్: ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జూలూరి రమేష్ బాబు మాట్లాడారు. నిజమైన స్నేహితుడు జీవితంలో ఉంటే ఆ జీవితం సానుకూలంగా సాగుతుందన్నారు. క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, కార్యదర్శి శ్రీధర్, శ్రీనివాస్, శ్రీను, వెంకటేష్ ఉన్నారు.

అచ్చంపేట రూరల్: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం అచ్చంపేటలో పలు సంఘాలు, మిత్రమండలి సభ్యులు, పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చేతులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకున్నారు.

వాడుతున్న చేళ్లు.. ఆందోళనలో రైతులు

నాగర్‌కర్నూల్‌రూరల్: వర్షాకాలంలో సాగు చేసిన పత్తి చేళకు వాడుపడుతున్నాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజులు కురిసిన వర్షాల కారణంగా నీరుపట్టిన పత్తిచేలు ప్రస్తుతం వర్షాలు మొఖం చాటేయడంతో ఒక్కసారిగా వాడొచ్చి చేతికొచ్చిన పత్తి చేళల్లో గూడ, పిందె రాలుతూ రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. అవసరమైన సందర్భంలో పత్తిచేళకు వర్షం లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు మాత్రం స్ప్రింక్లర్ల సాయంతో పత్తి చేళను కాపాడుకునేందుకు నీటిని వదిలి తడుపుతున్నారు. నీటి వసతి లేని రైతులు మాత్రం దిక్కు తోచనిస్థితిలో ఆకాశాని కేసి చూస్తున్నారు. మరో వారం పాటు వర్షాలు రాకపోతే చేతికొచ్చిన పత్తిచేళ్లు 80 శాతం దెబ్బతిని దిగుబడి రాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేత

చారకొండ: మండలంలోని జూపల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గంగల శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబాన్ని జూపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆదివారం పరామర్శించి, రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. భవన నిర్మాణ కార్మికులు రామచంద్రి, శ్రీను, దేవేందర్, రామస్వామి, చాంద్, అర్జున్, లింగం తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ యువజన కాంగ్రెస్



లింగాల: యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ ఆధ్వర్యంలో ఆదివారం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించారు. భాగ్యమ్మకు రూ.3 వేలు, బిక్కు రాజుకు రూ.1,500 ఆర్థిక సాయం అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

తాడూరు: మండలంలోని అల్లాపూర్, సిర్సవాడలోని వివిధ పార్టీలకు చెందిన యువకులు ఆదివారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. చేరిన వారందరికి ఎమ్మెల్యే మర్రి కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ యూత్ ఇన్‌చార్జ్ జలీల్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన 60 మందికిపైగా యువకులు పార్టీలో చేరారు. గౌరీకుమార్, నరేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిక

నాగర్‌కర్నూల్ రూరల్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కొల్లాపూర్ పర్యటనకు రాగా.. ఆదివారం నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలువురు యువ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. బీఎస్పీలో చేరిన వారిలో పట్టణానికి చెందిన పర్శ ముదిరాజ్, అబ్దుల్ నజీర్, ఎండి పాహీంలు తదితరులు ఉన్నారు. నాగన్న, పృథ్వీరాజ్, మహేశ్ యాదవ్, దేవదాస్, లక్ష్మణ్, శివశంకర్, బాలనాగులు తదితరులు ఉన్నారు.

వాసవీమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు

చారకొండ: అధిక శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలో శ్రీపద్మావతి వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం వాసవీ మాతగా అమ్మవారిని అలంకరించి మహిళలు ఆలయంలో దీపాలను వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వివిధ రకాల వాయనాలను సమర్పించారు. కార్యక్రమంలో అనిత, విజయలక్ష్మి, వరలక్ష్మి, సంతోషిణి, దివ్య, శివలీల, పద్మ, గీత తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ మృతి తీరని లోటు



కొల్లాపూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి: గద్దర్ మృతి తీరని లోటని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వాదులంతా ఆయన మృతిని జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఆదివారం విజయ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఆటపాటలతో ప్రజలను చైతన్యవంతం చేసిన యోధుడు అని అన్నారు.

మౌనం పాటించిన పంచాయతీ కార్మికులు

పెద్దకొత్తపల్లి: ప్రజాగాయకుడు గద్దర్ అనారోగ్యంతో మృతిచెందడంతో మండల కేంద్రంలో మండల పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరంలోనే రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు మల్లయ్య, రాముడు, మద్దిలేటీ, రాంబాబు, ఎల్లమ్మ, మశమ్మ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన ప్రజాగాయకుడు గద్దర్ అభిమానులు ఆదివారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని జగ్జీవన్‌రాం చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి బీఎస్పీ నాయకులు శేఖరయ్య, నర్సింహ, మునిస్వామి, వెంకటేష్‌నాయుడుతో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రంగినేని జగదీశ్వరుడు, రాము యాదవ్, నరేందర్‌రెడ్డి, కట్టా శ్రీనివాసులు సంతాపం ప్రకటించారు.

దోమలపెంట: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి రాష్ట్రానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ కో కన్వీనర్ కె.బుచ్చిరాములు అన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో మాదిగల ఐక్యవేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాగాయకుడు గద్దర్‌కు ఘన నివాళి అర్పించారు. కమిటీ అధ్యక్షుడు మీసాల అంజయ్య, ప్రభాకర్, పుల్లయ్య, జగదీశ్వర్, రాము తదితరులు ఉన్నారు.



వెల్దండలో నివాళి అర్పిస్తున్న నాయకులు

కోలాటం వేసి పంచాయతీ కార్మికుల నిరసన



కల్వకుర్తిలో కోలాటం ఆడుతున్న కార్మికులు



పెంట్లవెల్లిలో మాట్లాడుతున్న ఈశ్వర్

కల్వకుర్తి రూరల్: సమస్యలు పరిష్కరించేదాక తాము చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగిస్తామని పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట కోలాటం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఆంజనేయులు, అశోక్, జగన్, లక్‌పతి పాల్గొన్నారు.

32 రోజుకు కార్మికుల సమ్మె

ఊర్కొండ: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 32 రోజుకు చేరింది.

తెలకపల్లి: గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 32వ రోజుకు చేరింది. సీఐటీయూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఏపీ మల్లయ్య సమ్మెకు మద్దతు తెలియజేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దతు తెలియజేసి మాట్లాడారు. 44 చట్టాలుగా ఉన్న లేబర్‌కోడ్‌లను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

నల్లబెల్లం విక్రయిస్తే చర్యలు



నల్లబెల్లం పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

అచ్చంపేట రూరల్/ బల్మూర్: నిషేధిత నల్లబెల్లం అమ్మినా, సరఫరా చేసినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐలు కృష్ణయ్య, పరమేశ్వర్ హెచ్చరించారు. ఆదివారం తెల్లవారుజామున అచ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల మండల శివారుల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. అచ్చంపేట మండలం చెన్నారం గేటు సమీపంలో ఆటోలో 270 కిలోల నల్లబెల్లం, 40 కిలోల స్పటిక తరలిస్తుండగా.. పట్టుకున్నారు. ఆటో డ్రైవర్ పరారయ్యాడు. బల్మూర్ మండలం మంగళికుంటపల్లి గేటు సమీపంలో బైక్‌పై 8 లీటర్ల సారాను తరలిస్తున్న ఉప్పునుంతల మండలం దేవదారికుంట తండాకు చెందిన రాజును పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలరాజు, సతీష్, సిబ్బంది రవి, రాఘవేంద్ర, శ్రీనివాస్ రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

అనాథ చెంచు విద్యార్థులకు అల్పాహారం



పలకలు, నోట్‌బుక్స్ అందజేస్తున్న ప్రణీత్

అచ్చంపేట రూరల్: తన పుట్టిన రోజు సందర్భంగా ఓ బాలుడు తల్లిదండ్రుల సహకారంతో ఆదివారం పట్టణంలోని వనవాసి సేవా ప్రకల్ప వసతి గృహంలోని అనాథ చెంచు విద్యార్థులకు అల్పాహారం అందించాడు. పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిషోర్, ప్రశాంతి దంపతుల కుమారుడు ప్రణీత్ పుట్టిన రోజున 50 మంది చెంచు విద్యార్థులకు అల్పాహారం అందించి వారికి అవసరమయ్యే నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులు, పరీక్ష ప్యాడ్లు అందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు యాదమ్మ, యాదగిరి, భాస్కర్, రాజేందర్, శోభ, భాగ్యలక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఆట వస్తువులు

తాడూరు: ప్రతి గ్రామానికి ఆటల సామగ్రి పంపిణీకి సిద్ధంగా ఉందని ఎంపీడీఓ గంగమోహన్ తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి యువజన క్రీడా విభాగానికి సంబంధించి ఆటల సామగ్రి ఎంపీడీఓ కార్యాలయానికి చేరిందన్నారు. మండలంలోని 24 గ్రామాలకు సంబంధించిన క్రీడా సామగ్రి కార్యాలయానికి చేరుకోవడంతో వాటిని ఎలా పంపిణీ చేయాలనే విషయాలను జిల్లా స్థాయి అధికారుల సమాచారం మేరకు పంపిణీ చేస్తామన్నారు. క్రికెట్ కిట్, వాలీబాల్, రింగ్‌బాల్, డంబెల్స్, స్కిప్పింగ్, క్రీడాకారులకు టీషర్ట్‌లు వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు.

కారుకొండ మహిళకు డాక్టరేట్



సత్యవతి

బిజినేపల్లి: వైఎస్‌ఆర్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆ పార్టీ బోదన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోయిన్‌పల్లి సత్యవతికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల సాహిత్యం విభాగంలో ఆదివారం డాక్టరేట్ ప్రకటించింది. బిజినేపల్లి మండలం కారుకొండలో పుట్టిన సత్యవతి అజారు చారుసీమ, పోర్ క్వార్టర్స్, ద థౌజండ్ ఫేసెస్ ఆఫ్ నైట్, వెన్ డ్రీమ్ ట్రావెల్స్ అనే రచనలపై సత్యవతి పరిశోధనలు చేశారు. అంతేకాక సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న కుల, మత, వర్గ, లింగ, సామాజిక వివక్ష, అసమానతలపై ఆయా పాత్రలు చేసిన పోరాటాలపై కూడా పరిశోధనలు చేశారు. కారుకొండలో పుట్టిన సత్యవతి సుదీర్ఘకాలం పాటు ప్రగతిశీల విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పనిచేశారు. పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పని చేశారు. రాష్ట్రంలో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలతో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. రాజకీయ రంగంలో ఆమెను గుర్తించి మార్చి 8, 2021లో ఆల్ ఎన్జీఓ ఆర్గనైజేషన్స్ వారు మహిళా శిరోమని జాతీయ అవార్డును అందించారు. సావిత్రి బాయి పూలే ఫౌండేషన్ ప్రజాస్వామ్య పరిరక్షణ అవార్డును 12వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అందజేశారు.

ఆటో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ఇంటిముందు నిలిపి ఉన్న ఆటో చోరీకి గురైన ఘటన ఆదివారం తెల్లవారుజామున జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన నారాయణ రాత్రి ఇంటి ముందు ఆటోను నిలిపి ఇంటో పడుకున్నాడు. ఉదయం లేచి చూసే సరికి ఆటో కనిపించలేదు. దీంతో ఆటోను ఎవరో దొంగిలించారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీటీ రోడ్డు లేక ఇబ్బంది

నాగర్‌కర్నూల్‌రూరల్: నియోజకవర్గ పరిధిలోని చిన్నముద్దునూరు నుంచి రాయిపాకుల వరకు రూ.3 కోట్ల నిధులు గతేడాది మంజూరైనా.. బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగడంలేదు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనులు తీసుకున్న సంబంధిత కాంట్రాక్టర్ ఈ రోడ్డుపై రెండు దఫాలుగా కంకర వేసి వదిలేయడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు బండ్లు జారిపడి గాయాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే ఈ రోడ్డుపై బీటీ వేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.